సాక్షి
అనంతపురం
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



పంట నష్టం రూ.97 లక్షలు
నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఉద్యాన పంటలకు రూ. 97 లక్షల నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.



టమాట కిలో రూ.43
అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.43 పలికింది. కనిష్టం రూ.16, సరాసరి రూ.28 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.2°/22.6°
జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

25 మండలాల్లో వర్షం



రాయదుర్గంలో కురుస్తున్న వర్షం

అనంతపురం అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 25 మండలాల పరిధిలో 11.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనంతపురంలో 64.2 మి.మీ భారీ వర్షం కురిసింది. బుక్కరాయసముద్రం 53, గార్లదిన్నె 46.6, బొమ్మనహాళ్ 26, పెద్దవడుగూరు 24.6, ఉరవకొండ 21.6 మి.మీ మేర మోస్తరుగా వర్షం కురిసింది. మిగతా మండలాల్లో జడితో కూడిన తేలికపాటి వర్షాలు కురిశాయి. అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు నిలిచాయి. పరిసర ప్రాంతాల్లో వంకలు ప్రవహించాయి. అక్టోబర్ సాధారణం 100.9 మి.మీ కాగా ఇప్పటికే 105 మి.మీ వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఉద్యమంలా 'అమ్మ పేరుతో ఒక మొక్క'

- మంత్రి సత్యకుమార్



మొక్క నాటుతున్న మంత్రి

అనంతపురం ఎడ్యుకేషన్: 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. స్థానిక కేఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం మొక్క నాటి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో నాటిన మొక్కకు ప్రధాని మోదీ తల్లి పేరు హీరాబెన్ మోదీ నామకరణం చేశామన్నారు. ప్రజలందరూ ఉత్సాహంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్క రేపు వృక్షంగా మారి నేటి శిశువును తల్లిలా కాపాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ దళిత మోర్చా అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు ఫాతిమా బేగం, కేవీవీ శర్మ, బి. రామకృష్ణ, రామాంజనేయులు, షఫీ, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి, సౌగంధిక, అంజన రెడ్డి, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

23న సర్వజనాస్పత్రిలో మెడికల్ క్యాంపు

అనంతపురం మెడికల్: వినికిడి సమస్యతో బాధపడుతున్న 19 ఏళ్ల లోపు వారి సౌకర్యార్థం ఈ నెల 23న అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో (ఓపీ నంబర్ 99 డీఈఐసీ) మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తంగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలోని ఆరోగ్య శాఖ సిబ్బంది ఈ విషయంపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు.

పింఛన్లు తొలగిస్తారా?





మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, సమస్యలపై ఎమ్మెల్యే రాజును నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

పేదల కడుపు కొడతారా..
- గళమెత్తిన జెడ్పీటీసీ సభ్యులు
- భారీ వర్షాలతో అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయని ఆందోళన
- రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్
- తాగు, సాగునీటిపైనా సుదీర్ఘ చర్చ
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: రాజకీయ కక్షతో సామాజిక పింఛన్లు తొలగిస్తారా అంటూ జెడ్పీటీసీ సభ్యులు మండిపడ్డారు. భారీ వర్షాలతో అన్ని రకాల పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో శనివారం సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి సత్యకుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. పింఛన్ల తొలగింపు, రైతాంగం సమస్యలు, తాగు, సాగునీటి అవసరాలపై ప్రధానంగా చర్చ సాగింది.

అప్పుడు అర్హులు.. ఇప్పుడు అనర్హులా?
కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల పింఛన్లు తొలగించడం దారుణమని కనగానపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు కుంపటి భాగ్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు జోక్యం చేసుకుంటూ అనర్హులను మాత్రమే తొలగించాల్సి వచ్చిందని చెప్పగా.. జెడ్పీటీసీ సభ్యులందరూ ఒక్కసారిగా గళమెత్తారు. అన్ని అర్హతలు ఉన్న వారికే మంజూరు చేశారని, వారంతా ఇప్పుడు ఎలా అనర్హులవుతారని నిలదీశారు. రాజకీయ కక్షతో పేదల కడుపు కొడితే మీకేమొస్తుందంటూ మండిపడ్డారు. జిల్లాలో 5,908 వృద్ధాప్య పింఛన్లు, 519 వికలాంగుల పింఛన్లు తొలగించినట్లు అధికారులే తమకు సమాచారం ఇచ్చారని, గతంలో అన్ని అర్హతలు ఉన్నాయని మంజూరు చేసిన వారే ఇప్పుడు అనర్హులంటూ ఎలా తొలగిస్తారని చైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే, జెడ్పీటీసీ సభ్యుల మధ్య మాటలయుద్ధం నడిచింది. జెడ్పీ చైర్‌పర్సన్ కల్పించుకుని నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

భారీ వర్షాలతో పంటలన్నీ నాశనం
ఎడతెరిపి లేని వర్షాలతో అన్ని రకాల పంటలు నాశనమయ్యాయని, కోట్లాది రూపాయల పెట్టుబడి నేలపాలైనట్లు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన పప్పుశనగ ఒక్కో బ్యాగు మాత్రమే సరఫరా చేయడంతో రైతులు బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయలేక సతమతమవుతున్నారని యల్లనూరు జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి వాపోయారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో ఎక్కువగా మిరప సాగు చేస్తారని, ఆయా ప్రాంతాల్లో శీతల గిడ్డంగులు నిర్మిస్తే రైతులకు మేలు చేసిన వారవుతారని గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్ సమావేశం దృష్టికి తెచ్చారు. పంట ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. వర్షాలతో వేరుశనగ పంట పాడైందని, రైతులకు ఉచితంగా విత్తన కాయలు సరఫరా చేయాలని విడపనకల్లు జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు విజ్ఞప్తి చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వ లేవని, రైతులకు చిరుధాన్యాలు సరఫరా చేసి సాగు చేసేలా ప్రోత్సహించాలని కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు కోరారు. వర్షాలకు రోడ్లు ధ్వంసం కావడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ డిమాండ్ చేశారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించి మండల తీర్మానం లేకుండా కేవలం పంచాయతీ తీర్మానాలతో పనులు మొదలుపెడుతున్నారని బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యులను పిలవకపోవడం ఎంత వరకు సమంజసమని సభ్యులు ప్రశ్నించారు. నార్పల మండలం సిద్దరాంపురం చెరువుకు నీరివ్వాలని, వజ్రకరూరు మండలం రాగులపాడు నుంచి వెంకటంపల్లి పెద్ద తండా వరకు హంద్రీ–నీవా కాలువ ఏర్పాటు చేయాలని ఎంపీపీ దేవి విజ్ఞప్తి చేశారు.

చెరువులు నింపండి
తమ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో నింపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ కోరారు. శ్రీసత్యసాయి జిల్లాలో పని చేసే ఏ శాఖ అధికారి కూడా జెడ్పీ సమావేశాలకు రావడం లేదని, ఆ జిల్లా కలెక్టర్ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలాగని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రశ్నించారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుద్దాం
రాజకీయంగా మీరంతా సీనియర్లు. నేను ప్రజాప్రతినిధిగా ఎన్నికై నాలుగు నెలలు మాత్రమే అవుతోంది. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పనిచేద్దాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అవసరమున్న చోట పీహెచ్‌సీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ధర్మవరం నియోజకవర్గంలోని 49 చెరువులు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా నింపాలని ఇటీవల ఐఏబీ సమావేశంలో చర్చించాం. సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రయత్నించాలి. గ్రామీణ సడక్ యోజన కింద రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి. జెడ్పీ సమావేశాలకు తప్పనిసరిగా కలెక్టర్లు రావాల్సిందే. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయ కారణాలు, వివక్ష లేకుండా పింఛన్ అందే విధంగా కృషి చేస్తాం. – మంత్రి సత్యకుమార్

సమస్యలు పరిష్కరించాలి
సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలి. వచ్చే సమావేశం నాటికి వాటిని పరిష్కరించాలి. సమావేశానికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ సహా అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరికీ విధిగా ప్రొటోకాల్ పాటించాలి. – బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

అధికారులు హాజరవ్వాల్సిందే
కలెక్టర్ సహా అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాల్సిందే. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకుంటాం. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు గ్రామ, మండల, జిల్లా పరిషత్ అప్రూవల్ తీసుకోవాలి. జల్ శక్తి అభియాన్ కింద చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, ఇతర పనులు చేపడతాం. భైరవానితిప్ప ప్రాజెక్ట్‌లో నీటి నిల్వకు చర్యలు తీసుకుంటాం. లీకేజీల నివారణ, మరమ్మతులకు నిధులు ఇస్తాం. అన్ని మండలాలకు రోడ్డు కనెక్టివిటీ ఇస్తాం. అనంతపురం నడిమివంక, మరువవంకలో చెత్త, ప్లాస్టిక్ వేయడం వల్ల శుభ్రం చేయడానికి రెండు రోజులు పట్టింది. నగరంలో ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి. రైతుల నుంచి వసూలు చేసిన డబ్బును ప్రభుత్వానికి కట్టని ఆర్‌ఎస్‌కే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. పింఛన్ల తొలగింపుపై అధికారులే వెళ్లి వివరాలు నమోదు చేయాలి. – వినోద్‌కుమార్, కలెక్టర్

భార్య సీమంతం రోజే పరలోకాలకు..

- పెన్నానది వంతెనను ఢీకొని యువకుడి మృతి
- గుండెలవిసేలా రోదించిన కుటుంబీకులు
- కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లిలో విషాదం





వంతెనను ఢీకొని కిందపడిన గంగాధర్‌ను తీసుకువస్తున్న స్థానికులు (ఇన్‌సెట్‌లో) గంగాధర్(ఫైల్)

బెళుగుప్ప: అతనికి తన భార్య అంటే ఎంతో ఇష్టం. ఎంతో అపురూపంగా చూసుకుంటున్న ఆమె ఇటీవల గర్భం దాల్చగా.. సీమంతం ఘనంగా నిర్వహించాలని స్వగ్రామానికి తీసుకొచ్చాడు. బంధువులు, తెలిసిన వారందరికీ కబురు పంపాడు. చాలామంది ఇప్పటికే వారింటికి చేరుకోగా.. అంతా సందడిగా మారింది. అందరితో తన ఆనందం పంచుకున్న అతను.. వంట సరుకుల కోసం నగరానికి వచ్చాడు. వాటిని తీసుకుని ఎంతో సంతోషంగా వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. తీవ్ర విషాదం నింపింది. పెన్నానది వంతెనను ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కాలువపల్లి గ్రామం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి గ్రామానికి చెందిన గంగప్ప, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు గంగాధర్ (35) తన భార్య శిల్పతో కలసి అనంతపురంలో నివాసముంటున్నాడు. ఇటీవల భార్య గర్భం దాల్చగా, ఆమెను సొంతూరికి తీసుకొచ్చాడు. శనివారం సాయంత్రం సీమంతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాడు. ఆదివారం మాంసాహారం చేయిద్దామని తలచి పొట్టేళ్ల కొనుగోలుకు బైకుపై అనంతపురం మార్కెట్‌కు వెళ్లాడు. వాటిని కొనుగోలు చేసిన అనంతరం ఓ వాహనం బాడుగకు మాట్లాడుకుని స్వగ్రామం పంపే ఏర్పాట్లు చేశాడు. తాను బైకుపై వెనకే వస్తూ వాహనాన్ని ముందు పంపించాడు. ఈ క్రమంలోనే కాలువపల్లి వద్దకు రాగానే వేగాన్ని అదుపు చేయలేక పెన్నానది వంతెనను బలంగా ఢీకొని ఎగిరి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని బెళుగుప్ప ఎస్‌ఐ శివ పరిశీలించారు. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గంగాధర్ మృతి విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రి వద్దకు తరలివచ్చారు. మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించారు. తనకు దిక్కెవరంటూ శిల్ప విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లింగ నిర్ధారణ చట్టానికి సంబంధించి జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణకు పాల్పడితే ఎదురయ్యే సమస్యలకు సంబంధించిన బోర్డులను ప్రజలకు కన్పించేలా ఏర్పాటు చేయాలని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో స్కానింగ్ సెంటర్లు, గైనిక్ ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ సుజాత, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ అనుపమజేమ్స్, గైనకాలజిస్టు డాక్టర్ రేణుక, చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సెలవులో డీఈఓ



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ ఈనెల 23 వరకు సెలవుపై వెళ్లారు. అనారోగ్య కారణంగా ఆమె సెలవు పెట్టినట్లు తెలిసింది. 24న విధుల్లో చేరనున్నారు. అప్పటి దాకా అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణయ్య ఇన్‌చార్జ్ డీఈఓగా వ్యవహరించనున్నారు.

ఒక్క సెంటూ ఆక్రమణకు గురికానివ్వం

- 'తమ్ముళ్ల' దురాక్రమణపై స్పందించిన అధికారులు
- 'సాక్షి'కి దళితుల కృతజ్ఞతలు



శ్మశానవాటికను సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని బీఎస్‌ఆర్ కాలనీ ఎదురుగా ఉన్న 'దళితుల శ్మశాన వాటిక' భూమిలో ఒక్క సెంటూ ఆక్రమణకు గురికానివ్వబోమని పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు పరిటాల సిద్దార్థ్ పేరు చెప్పుకుని కొందరు టీడీపీ కార్యకర్తలు దళితుల శ్మశాన భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశారు. జేసీబీతో చదును చేస్తుండగా అడ్డుకున్న దళితులను పరిటాల సిద్దార్థ్ పేరు చెప్పి బెదిరించిన విషయాన్ని శనివారం 'అన్న చెప్పాడు.. ఆక్రమిస్తున్నాం!' శీర్షికతో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫి, వీఆర్‌ఓ వెంకటమంజు, సర్వేయర్ అసిస్టెంట్ రామకృష్ణ శ్మశానవాటిక వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడుతూ ఏదైనా ఉంటే సిద్దార్థ్ వద్దకు వచ్చి మాట్లాడుకోవాలని తెలిపారని అధికారులకు వివరించారు. అనంతరం సర్వేయర్ అసిస్టెంట్ సర్వే చేయగా.. మొత్తం శ్మశానవాటికకు కేటాయించిన భూమి 1.70 ఎకరాలు ఉన్నట్లు గుర్తించి హద్దులు నాటారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. శ్మశాన స్థలం దురాక్రమణకు గురికాకుండా అండగా నిలిచిన 'సాక్షి'కి దళితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బెదిరింపులకు పాల్పడితే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలి
కబ్జా విషయంపై అనంతపురం రూరల్ మండల టీడీపీ నాయకులు కూడా స్పందించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మేకల వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ పాముురాయి రఘు మాట్లాడారు. పరిటాల కుటుంబం పేరుచెప్పి ఎవరైనా బెదిరించినా, ఇబ్బందులకు గురి చేసినా బాధితులు నేరుగా ఎమ్మెల్యే పరిటాల సునీతను లేదా ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తుల విషయంలో ఎవరు జోక్యం చేసుకున్నా పరిటాల కుటుంబం ఉపేక్షించదన్నారు.

పార్కింగ్.. పద్మవ్యూహం

- జటిలమవుతున్న పార్కింగ్ సమస్య
- నగరంలోనే కాకుండా పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి
- శివారు ప్రాంతాలకు వెళ్తేనే పార్కింగ్ స్థలమున్న ఇళ్లు లభిస్తున్న వైనం
- వాహనాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుండటంతో అవస్థలు

- పోలీసు శాఖలో పనిచేసే ఓ అధికారి ఇటీవల బదిలీపై అనంతపురం వచ్చారు. ఆయనకు కారు ఉంది. ఈ క్రమంలో పార్కింగ్ స్థలం ఉన్న ఇంటి కోసం నాలుగు రోజులుగా నగరంలో వెతుకుతున్నా ఎక్కడా దొరకడం లేదు. నెల రూ.రూ.14 వేలు అని చెప్పున్న ఇళ్ల వద్ద కూడా పార్కింగ్ స్థలం కనిపించడం లేదని ఆయన తెలిపారు.
- శ్రీనివాస నగర్‌లో ఓ ఫ్లైవుడ్ వ్యాపారి తన కారు పార్కింగ్ కోసం నిత్యం పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఆయన రోజూ రూ. లక్షల్లోనే వ్యాపారం చేస్తారు. కానీ, తాను ఉన్న చోట కారు పార్కింగ్ చేయడానికి తగిన స్థలం లేదని బాధపడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇన్నాళ్లూ విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి వంటి నగరాల్లోనే పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉందని అనుకునే వారు. కానీ ఇప్పుడు జిల్లాలో కూడా ఈ సమస్య నెలకొంది. ఇబ్బడిముబ్బడిగా వాహనాల సంఖ్య పెరగడంతో చిన్న పట్టణాల్లోనూ సమస్య జటిలంగా మారుతోంది. జిల్లాకేంద్రమైన అనంతపురంలో అయితే పార్కింగ్ పరిస్థితి పద్మవ్యూహంలా తయారైంది. పలు కాలనీల్లో ఇప్పటికే కార్లు తిరిగే పరిస్థితి లేదు. రహదారుల్లో ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతుండటంతో పాదచారులకూ ఇబ్బంది కలుగుతోంది.

చిన్న పట్టణాల్లోనూ..
అనంతపురం నగరంలోనే కాకుండా గుంతకల్లు, తాడిపత్రి, కళ్యాణదుర్గం వంటి పట్టణ ప్రాంతాల్లోనూ రోజురోజుకూ పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. కార్యాలయాలకు కార్లలో వెళ్లేందుకు భయపడుతున్న పరిస్థితి. అనంతపురంలో అయితే కారులో వెళ్తే పార్కింగ్ ఎక్కడ చేయాలో దిక్కు తెలియడం లేదు. నగరంలో షాపింగ్ మాల్స్ పెరగడం, వినియోగదారులు పెద్ద సంఖ్యలో క్యూ కడుతుండటంతో ప్రధాన రహదారుల్లో నడవడానికి కూడా వీలు లేకుండా పోతోంది.



అనంతపురం రాజురోడ్డులో రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

పార్కింగ్ ఉన్న ఇళ్ల కోసం జల్లెడ
జనాభా పెరగడం, పట్టణాలకు వస్తున్న వారి సంఖ్య ఎక్కువవుతుండటం తదితర కారణాలతో ఎక్కడా స్థలం చాలడం లేదు. కారు పార్కింగ్ చేసుకోవడానికి అనువైన ఇళ్లు కావాలంటే అనంతపురంలో నెలవారీ ఇంటి అద్దె రూ.14 వేలకు పైగా చెల్లించాల్సి వస్తోంది. లేదా కారుకు మాత్రమే ఎక్కడైనా పార్కింగ్ చేసుకోవాలంటే నెలకు రూ.1,000 నుంచి రూ.1,200 వరకూ చెల్లించాల్సిన పరిస్థితి.

జిల్లాలో వాహనాల వివరాలు

ఆటోలు, లారీలు	45,000
కార్లు	1,47,000
ద్విచక్రవాహనాలు	3,50,000
మిగతా వాహనాలు	10,000
మొత్తం	5,52,000

దీంతో చిన్నపాటి కార్లు ఉన్న మధ్యతరగతి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారుల్లో కొత్తగా వెలసిన కాలనీల్లో మాత్రమే కారు పార్కింగ్ ఉన్న ఇళ్లు లభిస్తుండటంతో అక్కడికే వెళ్లి ఉంటున్నారు.

భారీగా పెరుగుతున్న వాహనాలు..
జిల్లాలో వాహనాల సంఖ్య ఏటికేటికీ భారీగా పెరుగుతోంది. ద్విచక్ర వాహనాల సంఖ్య ఏటా 12 శాతం పైగా పెరుగుతున్నట్టు తెలిసింది. ఓ సంవత్సరంలో 800కు పైగా కొత్త కార్లు జిల్లాలోకి వస్తున్నట్టు అంచనా. ట్రాక్టర్లు, ఐషర్లు, స్కూలు బస్సులు, లారీలు ఓ మోస్తరుగా ఉంటున్నాయి. టూవీలర్ల తర్వాత ఆటోల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏటా 6 శాతం మేర మూడు చక్రాల వాహనాలు ఎక్కువవుతున్నట్లు అంచనా.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణస్వామి చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 8 రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. చివరి రోజైన శనివారం ఆలయం వద్ద పుష్కరిణిలో చింతలరాయుడి చక్రస్నానం నిర్వహించారు. ముందుగా సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి పుష్కరిణి వద్దకు పల్లకీలో తీసుకొచ్చారు. మంగళవాయిద్యాల నడుమ అర్చకులు చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం, పవిత్ర తులసి దళాలతో పూజలు చేశారు. అనంతరం చక్రస్నానం గావించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది. భక్తులు పెద్ద ఎత్తున పుణ్య స్నానాలాచరించారు.

క్లుప్తంగా

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్



మట్కా బీటర్లను అరెస్టు చూపుతున్న సీఐ

యల్లనూరు: తిమ్మంపల్లికి చెందిన బాబు, వాసాపురానికి చెందిన మస్తాన్ మట్కా రాస్తుండగా సీఐ సత్యబాబు శనివారం అరెస్ట్ చేశారు. బీటర్ల వద్ద నుంచి మట్కా పట్టీలతో పాటు రూ.1.40 లక్షల నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి వీరిని రిమాండ్‌కు పంపించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాంప్రసాద్, ఏఎస్‌ఐ సంపత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శంకర నారాయణ, సరోజ, కానిస్టేబుల్ గోవిందు, బాలరాజు పాల్గొన్నారు.

మరో ముగ్గురు అరెస్ట్..

యాడికి: లక్షుంపల్లె, యాడికిలోని కోన రోడ్ చౌడేశ్వరీ గుడి వద్ద మట్కా రాస్తున్న శివానందరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మేకల రామకృష్ణను శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదుతో పాటు 12 మట్కా పట్టీలు, రెండు పెన్నులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కల్లూరులో మరొకరు..

గార్లదిన్నె: కల్లూరుకు చెందిన మట్కా బీటర్ హాజీవలిని రైల్వే స్టేషన్ వద్ద శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు. ఇతని వద్ద మట్కా పట్టీలు, రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఎంపిక



చెస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

అనంతపురం: నగరంలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ కోసం అండర్–14 చెస్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఇందులో ప్రతిభచాటిన పలువురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సిబ్బంది వేణుగోపాల్, వరలక్ష్మి, అమీన్, విజయలక్ష్మి , పీడీలు శివకుమార్, రవి కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక వివరాలు

అండర్–14 బాయ్స్: డి.రిషిక్ (శ్రీవాణి హైస్కూల్, తాడిపత్రి), పి.మోక్షిత్ చౌదరి (శ్రీవాణి హైస్కూల్, తాడిపత్రి), పి.నీల్ శ్రీవాత్సవ్ (ఏపీఎంఎస్, గుత్తి), కేవీఎస్.చేతన్‌రెడ్డి (ఇండియన్ పబ్లిక్ స్కూల్, తాడిపత్రి), జె.నితీష్ (ప్రసాద్ స్కూల్, అనంతపురం).

అండర్– 14 గర్ల్స్: ఎ.అస్మిత (ఇండియన్ పబ్లిక్ స్కూల్, తాడిపత్రి), ఎ.యశస్విని (ఇండియన్ పబ్లిక్ స్కూల్, తాడిపత్రి), వై.లాలిత్య (శ్రీ చైతన్య స్కూల్, అనంతపురం), యు.త్రిపద (కేశవరెడ్డి స్కూల్, అనంతపురం), ఎ.అంబిక (ట్రెల్లిస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, అనంతపురం).

ఖాళీల రెవెన్యూ

- కీలక డీటీ, ఎస్‌ఏ, జేఏ పోస్టులు ఖాళీ
- కొన్ని చోట్ల రెగ్యులర్ డీటీలు లేని పరిస్థితి
- అనంతపురం అర్బన్‌లో మరీ అధ్వానం



అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగానికి గుండెలాంటి రెవెన్యూ శాఖలో కీలక పోస్టులు ఖాళీ ఉండడంతో ఆ ప్రభావం పాలనపై పడుతోంది. రెవెన్యూలో డిప్యూటీ తహసీల్దార్లు క్రియాశీలకంగా ఉంటారు. ఇలాంటి పోస్టులు ఖాళీగా ఉంటే ఇటు పాలన... అటు పనులు సవ్యంగా సాగవు అనే విషయాన్ని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఇదే క్రమంలో ఉన్నవారిపై పని ఒత్తిడి అధికమవుతోంది. దీంతో పనుల్లో నాణ్యత లోపిస్తోంది. జిల్లా కేంద్రం అనంతపురంలోని అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలతో పాటు ఆర్డీఓ కారాలయంలోనూ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పాలన కుదేలు..

పోస్టుల ఖాళీగా తహసీల్దారు కార్యాలయాల్లో పాలన కుదేలవుతోంది. నియోజకవర్గం కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయాల్లో డిప్యూటీ తహసీల్దారు (డీటీ), ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు (ఈడీటీ), రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు (డీటీ ఆర్ఎస్), పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ (సీఎస్‌డీటీ) పోస్టులు ఉంటాయి. మిగిలిన తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ–డీటీ పోస్టు తప్ప మిగిలిన మూడు డీటీ పోస్టులు ఉంటాయి.

- అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు డీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక రెవెన్యూ, మండల సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఖాళీనే. రెండు జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో ఒకరు మాత్రమే విధుల్లో ఉన్నారు. అరకొర సిబ్బందితో పాలన సాగించడం ఇక్కడ సమస్యగా మారింది.
- అనంతపురం రూరల్ తహసీల్దారు కార్యాలయంలో రెగ్యులర్ డీటీ పోస్టు ఖాళీగా ఉంది. ఇక కళ్యాణదుర్గం తహసీల్దారు కార్యాలయంలో ఒక ఈడీటీ, గుంతకల్ తహసీల్దార్ కార్యాలయంలో ఒక ఈ–డీటీ పోస్టు ఖాళీగా ఉంది.

ఆర్డీఓ కార్యాలయాల్లోనూ..

అనంతపురం ఆర్డీఓ కార్యాలయానికి డిప్యూటీ తహసీల్దారు పోస్టులు మంజూరే లేదు. దీంతో ఇక్కడ డిప్యూటేషన్‌పై డీటీలు పనిచేస్తూ వచ్చారు. ప్రస్తుతం వారి డిప్యుటేషన్ రద్దు చేయడంతో పాలన కుంటుపడే పరిస్థితి నెలకొందని కార్యాలయ వర్గాలు వాపోతున్నాయి. ఇక కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలోనూ డీటీ పోస్టు ఖాళీగా ఉంది.

ఖాళీల భర్తీపై దృష్టి పెట్టాలి

రెవెన్యూ సేవలు ప్రజలకు సత్వరం అందాలన్నా, పాలన సవ్యంగా సాగాలన్నా ఖాళీల భర్తీపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని రెవెన్యూ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతులు కల్పించడం ద్వారా పోస్టులు భర్తీ చేయవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం రీసర్వే నిలిచిపోయిన కారణంగా సీనియారిటీ ఉన్న రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లను రెగ్యులర్ తహసీల్దార్లుగా పదోన్నతితో ఖాళీలను భర్తీ చేయవచ్చని పేర్కొంటున్నారు.

డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు ఇలా..

డీటీలు	మంజూరైన పోస్టులు	పని చేస్తున్నది	ఖాళీలు
డీటీలు	55	51	4
డీటీఆర్ఎస్	32	30	2
ఈడీటీ	8	7	1
సీఎస్‌డీటీ	48	38	10
మొత్తం	143	126	17

త్వరలో పదోన్నతుల ప్రక్రియ



ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ పోస్టుల భర్తీపై కలెక్టర్ దృష్టి పెట్టారు. రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్లలో సీనియార్టీ ఉన్నవారికి రెగ్యులర్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తాం.

– జి.రామకృష్ణారెడ్డి, డీఆర్‌ఓ

గాయపడిన విదేశీయురాలి మృతి



అమెరికన్ లీడా

అనంతపురం: బాత్‌రూంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విదేశీయురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. అమెరికాకు చెందిన లీడా (60) కొంతకాలంగా పుట్టపర్తిలోని సాయి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటోంది. శుక్రవారం బాత్‌రూంలో ప్రమాదవశాత్తూ జారిపడటంతో తీవ్రంగా గాయపడింది. పుట్టపర్తి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం సర్వజనాస్పత్రి అత్యవసర విభాగంలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో లీడా శనివారం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ఎస్కేయూ అంతర కళాశాలల గ్రూప్–బీ క్రీడాపోటీలు ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ హాజరై క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ బి.జెస్సీ, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, సెక్రెటరీ డాక్టర్ కె.నిర్మలమ్మ ప్రిన్సిపాల్ సి.ప్రభాకర్‌రాజు, ఫిజికల్ డైరెక్టర్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బాస్కెట్ బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, జూడో, తైక్వాండో, రెజ్లింగ్, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడాంశాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్కేయూ క్యాంపస్ కళాశాలతో ఆర్ట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఎస్కేయూ క్యాంపస్ కళాశాల విజయం సాధించింది.

విద్యారంగం నిర్వీర్యం

- తల్లికి వందనం పథకానికి సర్కార్ ఎగనామం
- వైఎస్సార్ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్ర

అనంతపురం కార్పొరేషన్: విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మండిపడ్డారు. శనివారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద పిల్లలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యతోనే పేదరికం నిర్మూలన అవుతుందని ముందుచూపుతో తల్లిదండ్రులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రవేశపెట్టి.. 45 లక్షల మంది తల్లులకు రూ.12 వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. విద్యా, వసతి దీవెన అందించారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' పథకం కింద రూ.15వేలు చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలవుతున్నా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ పథకం అమలు చేయకుండా ఎగనామం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ రద్దు చేశారన్నారు. ఇంగ్లిష్ మీడియం తొలగించేందుకు కుట్ర పన్నారన్నారు. కీలకమైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో పాటు ఉన్నత విద్య మండలి చైర్మన్ స్థానాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన సాగిస్తున్నారంటే ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతోందన్నారు. మద్యం సిండికేట్‌పై ఉన్న ధ్యాస విద్యార్థుల భవిష్యత్తుపై లేదని ఎద్దేవా చేశారు. ఇది చాలక ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నారాయణ స్కూల్స్ అధ్యాపకులతో నీట్, ఐఐటీల్లో కోచింగ్ పేరుతో కొత్త దోపిడీకి తెరలేపారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దారుణాలను గమనిస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే ఉద్యమాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరెడ్డి, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇండ్ల విజయ్‌రెడ్డి, నాయకులు రాజేంద్రయాదవ్, ఆవుల రాఘవేంద్రరెడ్డి, గోకుల కైలాష్, వినయ్‌కుమార్, వాసు, వీరాంజనేయులు, రాధా, చరణ్, మహేష్ పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: ఉర్దూ భాషాభివృద్ధి, సాహితీ, విభిన్న విభాగాలలో అత్యుత్తమ సేవలందించిన వారికి నవంబర్ 11న మైనార్టీ సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి పురస్కారాలు అందజేయనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యం కోసం పాటుపడిన ఉపాధ్యాయులు, కవులు, పాత్రికేయులు, పరిశోధన, గద్య బోధన చేసిన వారు ఈ నెల 25 లోపు తమ దరఖాస్తులను ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ, విజయవాడ కార్యాలయానికి పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్ ఘన విజయం

ఆర్డీటీ స్టేడియంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

అనంతపురం : ఆర్డీటీ క్రీడా గ్రామంలో రాజమాత జిజాబాయి ట్రోఫీ -2024 సీనియర్ మహిళల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్ ఒడిశా– లడఖ్ జట్ల మధ్య జరిగింది. ఒడిశా 7 గోల్స్ సాధించగా, లడఖ్ ఒక గోల్ కూడా చేయకుండానే చతికిలపడింది. ఒడిశా తొలి మ్యాచ్‌లోనే ఘన విజయం సాధించి శుభారంభం చేసింది. మధ్యాహ్నం మధ్యప్రదేశ్– అరుణాచల్ ప్రదేశ్ జట్ల మధ్య రెండో మ్యాచ్ జరిగింది. ఇందులో మధ్యప్రదేశ్ ఒక గోల్ కూడా చేయలేదు. అరుణాచల్ ప్రదేశ్ 8 గోల్స్ సాధించి ఘన విజయం సాధించింది. కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, మాజీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్యారీ

ఇండియన్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్యారీ క్షాక్షా ఒడిశా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్యారీ క్షాక్షా స్టార్ ఫుట్‌బాల్ క్రీడాకారిణిని చూసి అభిమానులు ఆనందించారు. ఆర్డీటీ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ బాగుందని ప్యారీ కితాబిచ్చారు.



బాల్‌ను అడ్డుకుంటున్న గోల్ కీపర్



మ్యాచ్‌ను తిలకిస్తున్న తోటి క్రీడాకారులు

వేతనాలివ్వకుండా వేధిస్తున్నారు

- ప్రభుత్వం బిల్లులిచ్చినా కాంట్రాక్టర్ చెల్లించడం లేదు
- సీపీడబ్ల్యూఎస్ స్కీం వర్కర్ల ఆవేదన

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వం బిల్లులు చెల్లించినప్పటికీ తమకు వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ వేధిస్తున్నారని సమగ్ర రక్షిత నీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. దీంతో రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో పేర్కొన్న అంశాలిలా ఉన్నాయి. 'కదిరి నియోజకవర్గంలోని తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, ఎన్‌పీ కుంట, కదిరి, తలుపుల మండలాలలోని సీపీడబ్ల్యూఎస్ స్కీంలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నాం. 2019 సెప్టెంబరు వరకూ వేతనాలు, పీఎఫ్‌లు సక్రమంగా వచ్చాయి. ఆ తర్వాత కాంట్రాక్టు సంస్థ (శ్రీ లక్ష్మీ నరసింహ మెటల్) ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకున్నప్పటికీ.. మాకు మాత్రం వేతనాలు ఇవ్వలేదు. ఈ సంస్థ ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందినది. కాంట్రాక్ట్ సంస్థ అక్రమాలకు అధికారులు కూడా సహకరించారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టరును కలిశాం. జిల్లాస్థాయి గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేశాం. ఇకనైనా స్పందించి న్యాయం చేయాల'ని కోరారు.

తల్లిదండ్రుల చెంతకు పిల్లలు

అనంతపురం సెంట్రల్: వేర్వేరు ప్రాంతాల్లో ఇంటి నుంచి వెళ్లిపోయిన పిల్లలను చైల్డ్‌లైన్, పోలీసు అధికారులు పట్టుకొచ్చి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరానికి చెందిన బాలిక (14) అనంతపురం రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా ఉండడంతో రైల్వే పోలీసులు గుర్తించి చైల్డ్‌లైన్ 1098 అధికారులకు సమాచారం అందించారు. ధర్మవరం సీఐ రెడ్డప్ప సహాయంతో తిరిగి సదరు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహేష్ అనే బాలుడు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండడంతో రైల్వే పోలీసులు చైల్డ్‌లైన్ అధికారులకు సమాచారం అందించారు. చైల్డ్‌లైన్ సిబ్బంది సురేష్‌కుమార్, రైల్వే పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీడబ్ల్యూసీ(చైల్డ్ వెల్ఫేర్‌కమిటీ) ముందు హాజరుపరిచి తల్లిదండ్రులకు అప్పగించారు.

పరాకాష్టకు జేసీ కక్ష సాధింపు

- రెండోరోజూ న్యాక్ బృందం సభ్యుల అడ్డగింత
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కళాశాలకు ఇబ్బందులు సృష్టించేందుకు కుట్ర



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న జేసీ అనుచరులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్ష సాధింపు పరాకాష్టకు చేరింది. పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరుకు చెందిన బీవీ భాస్కర్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశారు. అప్పటి నుంచి ఈయనపై జేసీ కక్ష పెంచుకున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక భాస్కర్‌రెడ్డిని ఇబ్బందులకు గురి చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా ఆయనకు చెందిన సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలపై కన్ను పడింది. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులను తనిఖీల పేరుతో ఉసిగొలిపారు. భవనం శిథిలావస్థకు చేరిందని, విద్యార్థులు ప్రమాదంలో ఉన్నారని, భవనం ఖాళీ చేయించాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి చేయించారు. అయితే భాస్కర్‌రెడ్డి కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తనిఖీల కోసమని కళాశాలకు వచ్చిన న్యాక్ బృందాన్ని జేసీ మందీమార్బలంతో వచ్చి కళాశాలపై వివిధ రకాల ఆరోపణలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రెండోరోజు శనివారం కూడా న్యాక్ అధికారులను అడ్డుకుని అధికార దర్పం ప్రదర్శించారు. అధికారులను కళాశాలలోపలికి వెళ్లకుండా ధర్నాకు దిగారు. స్వార్థ రాజకీయాల కోసం విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నించారు. జేసీ దుశ్చర్యలపై ప్రజలు చీదరించుకోవడం కనిపించింది.

గుంతకల్లు-చిక్‌జాజూర్ ప్యాసింజర్ రైళ్లు రద్దు

గుంతకల్లు: సౌత్ వెస్ట్రన్ రైల్వే పరిధిలోని చిత్రదుర్గ వద్ద రైలు మార్గం పనులు జరుగుతున్నందున గుంతకల్లు-చిక్‌జాజూర్ మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. చిక్‌జాజూర్–గుంతకల్లు–చిక్‌జాజూర్ (07585/ 86) ప్యాసింజర్ రైలు ఈ నెల 20, 22, 23, 24, 25, 27, 29, 30, 31, నవంబర్ 1, 3, 5, 6, 7, 8, 10,12, 13, 14, 15, 17, 19, 20, 21, 22, 24, 26, 27, 28, 29 తేదీల్లోను, అలాగే డిసెంబర్ 1, 3, 4, 5, 6, 8, 10, 11, 12, 13 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతు సంక్షేమం గాలికి వదిలేశారు

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ ధ్వజం



కూడేరులో మాట్లాడుతున్న రాంభూపాల్

కూడేరు/గార్లదిన్నె/ రాప్తాడు/ ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ధ్వజమెత్తారు. జిల్లాలో సాగునీటి సాధన కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర శనివారం గార్లదిన్నె మండలం కోటంక నుంచి కమ్మూరు, అరవకూరు మీదుగా కూడేరుకు చేరుకుంది. అక్కడి నుంచి ఆత్మకూరు మండలం వడ్డుపల్లి, తలుపూరు, రాప్తాడు మండలం రాప్తాడు, హంపాపురం గ్రామాల వరకు బస్సు యాత్ర సాగింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగు నీరందించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. హంద్రీ-నీవా, హెచ్చెల్సీ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టులను నీటితో నింపి తద్వారా చెరువులకు నీటిని సరఫరా చేయడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యాయన్నారు. జిల్లాలో జలవనరుల అభివృద్ధి కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటిని విడుదల చేసి 49 చెరువులను నీటితో నింపి ఆయకట్టుకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. సామూహిక బిందుసేద్య పథకాన్ని పూర్తి చేసి అర్హులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీతో ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సాగు, తాగునీటి, రైతు సమస్యలపై ఈ నెల 21 కలెక్టర్ ఆఫీస్ ఎదుట మహా ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. వీరికి మద్దతుగా ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి రాయుడు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు రమణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు, సావిత్రి, మండల కార్యదర్శి వెంకటేశులు, చెన్నారెడ్డి, నేతలు వీరప్ప, కరీం, రాధాకృష్ణ, మల్లికార్జున, పోతులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సొల్లాపురంలో తన్నుకున్న 'తమ్ముళ్లు'

రాయదుర్గం: కణేకల్లు మండలం సొల్లాపురంలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు భగ్గుమంది. శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేశారు. ఆ సమయంలో టీడీపీ సీనియర్ నాయకుడు దూదేకుల సత్తార్ ఫొటో కోసం నిల్చొని ఉన్నాడు. అయితే టీడీపీకి చెందిన మరొక నాయకుడు ఫొటో దిగేందుకని సత్తార్‌ను పక్కకు వెళ్లాలంటూ హుకుం జారీ చేశాడు. ఇందుకు ఆయన ససేమిరా అనడంతో.. తమ నాయకుని మాటకు విలువ ఇవ్వవా అంటూ అనుచరులు రెచ్చిపోయారు. ఈ క్రమంలో ఇరువురు నాయకుల వర్గీయుల మధ్య తారస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఇతర నాయకుల జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిగించారు. ఇదిలా ఉండగా శనివారం రైతు సేవ కేంద్రం వద్ద జరుగుతున్న విత్తన శనగ పంపిణీ వద్దకు దూదేకుల సత్తార్ వెళ్లాడు. అక్కడ మరో నాయకుడి అనుచరులు రాజప్రకాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కల్పించుకుని 'ఏంరా.. నిన్న మా నాయకుడు ఫొటో దిగుతాడు... పక్కకు తప్పుకోమంటే వినకుండా గొడవ పెట్టుకొంటావా? మా నాయకునికే అవమానం చేస్తావా?' అంటూ సత్తార్‌ను చితక్కొటారు. అక్కడే ఉన్న సత్తార్ బంధువు ఖాదర్ అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతడిపైనా దాడి చేశారు. దీంతో ఖాదర్, బంధువు కూడా తిరగబడి ప్రతిదాడి చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో 'తమ్ముళ్లు' తన్నుకున్నారని బయటకు తెలిస్తే పార్టీ పరువుపోతుందని పెద్దలు రంగంలోకి దిగారు. పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా ఇరువర్గాల వారినీ రాజీకి ప్రయత్నించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ



పంపనూరులో భూమి పూజ చేసిన అధికారులు

ఆత్మకూరు: మండల పరిధిలో పంపనూరు, సిద్ధరాంపురం గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. పంపనూరులో అసంపూర్తిగా ఉన్న సచివాలయ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహా మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, ఈఓఆర్డీ కామక్క, పంచాయతీ సెక్రటరీలు బి.శిరీష, ఎం.శిరీష, టీడీపీ నాయకులు శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకురం వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలో ప్రసిద్ధి చెందిన శ్రీత్యాగరాజ సంగీత సభలో శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలు పునః ప్రారంభం కానున్నాయని సభ అధ్యక్షుడు ఎస్‌సీ సంపత్ కుమార్, సీనియర్ కవి నబీరసూల్ తెలిపారు. 'అంకురం' పేరుతో సాగే వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత కళాకారిణి కేరళకు చెందిన అలా వేణుగోపాల్ ప్రదర్శన ఉంటుందన్నారు. దేశ విదేశాల్లో మోహినీ అట్టం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో ఆకట్టుకుందన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు నాట్య ప్రదర్శన ప్రారంభమవుతుందని కళాభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో వంటలు చేస్తున్న కార్యకర్తలు

ఆత్మకూరు: గర్భవతులు, బాలింతలు రుచికరమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి తెలిపారు. శనివారం మండలంలోని సనప గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మునగ, కరివేపాకు, నిమ్మ చెట్లు తప్పనిసరిగా నాటాలన్నారు. మరింత స్థలం ఉంటే ఆకు కూరలు సాగు చేయవచ్చని పేర్కొన్నారు. పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పండ్లు చెట్ల ప్రయోజనాలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పలు రకాల పౌష్టికాహార వంటలను చేసి అవగాహన కల్పించారు. సనప అంగన్‌వాడీ కేంద్రం బయట ఉన్న ముళ్ల కంపలు ఉండటంలో పాములు వస్తున్నాయని తెలిపారు. చిన్నారులు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోరారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

అనంతపురం: లా విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఎన్జీఓ నేచురల్ జస్టిస్ లీగల్ ఎయిడెడ్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేశారు. రీవాల్యుయేషన్ ఫలితాలు వచ్చినా, ఎల్ఎల్‌బీ ఐదు, ఆరో సెమిస్టర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నారు. నిబంధనలు మేరకు ఇన్‌స్టంట్ పరీక్ష అయినా నిర్వహించాలని కోరారు. ఎన్జీ నేచురల్ జస్టిస్ లీగల్ ఎయిడెడ్ సభ్యులు పనిభూషణ్, హేమంత్ రాజు, చంద్ర, భాస్కర్, రవి, జయరాజ్, మధు పాల్గొన్నారు.

జీవాల సంతలో మార్కెటింగ్ విజిలెన్స్ టీం



జీవాల సంతలో రుసుం వసూళ్లను పర్యవేక్షిస్తున్న మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ టీం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో వారాంతపు సంతలో రుసుం వసూళ్ల పెంచడంపై మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ బృందం దృష్టి సారించింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రుసుం వసూలు కౌంటర్‌లో తిష్ట వేసి వసూళ్లను పర్యవేక్షించారు. ప్రతి శనివారం గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత జరుగుతుండగా.. ఒక్కో జీవానికి రూ.50 ప్రకారం వసూలు చేస్తున్నారు. అలాగే ఆదివారం జరిగే పశువులు, గేదెలు, ఎద్దుల సంతలో ఒక్కో దానికి రూ.200 ప్రకారం రుసుం వసూలు చేస్తున్నారు. వాహనాల సామర్థ్యాన్ని బట్టి రుసుం వసూళ్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వసూళ్లు సక్రమంగా జరిగేలా విజిలెన్స్ టీం పర్యవేక్షించింది. మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయం నుంచి ఒకరు ఉండగా.. అనంతపురం యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కె.గోవిందు, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి సెక్రటరీలు రామ్‌ప్రసాద్, కేదార్‌నాథ్, ఆనంద్‌లు విజిలెన్స్ బృందంలో ఉన్నారు. వీరందరూ శనివారం వసూళ్లను పర్యవేక్షించారు. గ్రేడ్ సెక్రటరీ రూప్‌కుమార్, సూపర్‌వైజర్లు కేశవ కుమార్, కృపారాణి, నాగేంద్ర పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- శిథిలావస్థకు చేరిన పక్కా భవనాలు
- పలు కేంద్రాల్లో వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు



హంపాపురం గ్రామంలో అద్దె భవనంలో చిన్నారులకు విద్యా బోధన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాలు వసతుల లేమితే కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడి నుంచే చక్కటి సేవలు అందించడంతో పాటు చిన్నారులకు ప్రీ స్కూల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. అంగన్‌వాడీ వ్యవస్థ ప్రారంభమై దాదాపుగా 40 ఏళ్లు గడిచినా నేటికీ అక్కడక్కడా సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. పాడుబడ్డ భవనాలు, వర్షకాలం వచ్చిందంటే గదులు కారడం, అసౌకర్యాలతో కూడిన అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తుండడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పక్కా భవనాల కొరత పట్టి పీడిస్తోంది. దీంతో చిన్నారుల సైతం బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ లేక అపరిశుభ్రంగా తయారయ్యాయి.

కూలేందుకు సిద్ధం..

పక్కా భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రాప్తాడు నియోజకవర్గంలో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో 394 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మెయిన్ బిల్డింగ్‌లు 344, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 50 ఉన్నాయి. ఇందులో కేవలం 230 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 115 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరో 49 భవనాల్లో అద్దె లేకుండా ఫ్రీ భవనాల్లో నిర్వహిస్తున్నారు. 230 కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నా.. వాటిలో దాదాపుగా 100 భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల పక్కా భవనాలకు ప్రహరీ లేకపోవడంతో అంగన్‌వాడీ పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. ఇక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల సంగతి చెప్పనక్కర్లేదు. గాలి, వెలుతురు సరిగ్గా లేని ఇరుకు గదుల్లో కొన్ని చోట్ల కేంద్రాలు నిర్వహిస్తుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కొన్ని చోట్ల నీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేవు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పక్కాభవనాల నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.

భవనం మంజూరు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక, కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే హంపాపురంలో కేంద్రాన్ని రెండు చోట్లకు మార్చడం జరిగింది. అద్దె భవనంలో సరైన వసతులు లేక పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే అంగన్‌వాడీ కేంద్రం కారుతోంది. దీంతో కేంద్రంలోని పౌష్టికాహారంతో పాటు నిత్యావసర వస్తువులు తడిసిపోతున్నాయి. వర్షం వస్తే పిల్లలు కేంద్రానికి రావడం లేదు. గ్రామంలో పాత సచివాలయం నిరుపయోగంగా ఉంది. అధికారులు స్పందించి కేంద్రానికి భవనం మంజూరు చేయాలి. – శివలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, హంపాపురం

ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక ప్రభుత్వ పాఠశాలలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. గతంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం ఉన్నా అది శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠశాలలో చిన్న గదిలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. పక్కనే పెద్ద గది ఖాళీగా ఉన్నా ఆ గదిని కేంద్రానికి వాడుకోవాలంటే విద్యాశాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని హెచ్‌ఎం చెబుతున్నారు. – శివమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త, హంపాపురం

పూర్తిస్థాయిలో భవనాలు నిర్మిస్తాం

పూర్తి స్థాయిలో భవనాలు నిర్మించాడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మా ప్రాజెక్టు పరిధిలో 12 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. నాడు–నేడు కింద 8 అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మిస్తున్నాం. మిగిలిన భవనాలకు విడతల వారీగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే భవనాలు నిర్మిస్తాం. మా ప్రాజెక్టులో దాదాపుగా 120 పక్కా భవనాలు ఉన్నాయి. ఏ ప్రాజెక్టులో కూడా ఇన్ని భవనాలు లేవు. – ధనలక్ష్మి, సీడీపీఓ, అనంతపురం రూరల్ ప్రాజెక్టు

ముమ్మరంగా సహాయక చర్యలు



రజకనగర్‌లో రోడ్లపై ఉన్న వరద నీటిని మున్సిపల్ కార్మికులతో క్లీన్ చేయిస్తున్న మేయర్ వసీం



జనశక్తి నగర్‌లో ప్రజలకు ధైర్యం చెబుతున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. ప్రజలు భయాందోళనతో వణికిపోయారు. స్పందించిన మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి వేర్వేరుగా ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. సహాయక చర్యలు చేపట్టారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక యంత్రం ద్వారా నీరు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

మురుగు, బురద లేకుండా చూడాలి

మేయర్ వసీం శనివారం ఉదయం ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలోని వడ్డేవారి కాలనీ, జనశక్తి నగర్, రజక నగర్, భవానీ నగర్, వినాయక నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడ మురుగు, బురద నిల్వకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పారిశుధ్య సిబ్బంది, ఇంజినీర్లు, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ అధికారులందరూ రౌండ్ ద క్లాక్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అవసరాన్ని బట్టి స్పందించాల్సి ఉంటుందన్నారు. బాలాజీ కాలనీలో మురుగు రోడ్డుపై ఉండటంతో డోజర్ ద్వారా శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, రామచంద్ర, గంగాధర్ పాల్గొన్నారు.

స్పందించిన డిప్యూటీ మేయర్..

శుక్రవారం రాత్రి 1 గంట సమయంలో విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి నగరంలోని రజక్‌నగర్, జనశక్తినగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అర్ధరాత్రి జేసీబీ ద్వారా పలు కల్వర్టుల్లో అడ్డుగా నిలిచిన చెత్తా చెదారం, పూడికను తొలగించేలా అధికారులను ఆదేశించారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పూడికతీత వేగవంతం చేయాలి

నడిమివంక, మరువ వంక ప్రాంతాల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం సోమనాథ్ నగర్, రాంనగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో కాలువల్లో జరుగుతున్న పూడికతీత పనుల స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. వర్షాకాలంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సద్వాణి, త్రిభాషా వాణి పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో శనివారం అధ్యాపకుడు, అనేక ధార్మిక సంస్థల్లో వ్యాఖ్యాత అయిన డాక్టర్ పీవీవీడీ నాగ త్రిశూల పాణి రచించిన పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఆచార్య శలాక రఘునాథ శర్మ, దోర్బల ప్రభాకర్ శర్మ, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల కార్యదర్శి డాక్టర్ కె.నిర్మలమ్మ, కళాశాల అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి చేతుల మీదుగా 'సద్వాణి, త్రిభాషా వాణి' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తకానికి 'సద్వాణి' అని పేరు పెట్టడంలోనే రచయిత దృక్పథం ఏమిటో ఇట్టే తెలుస్తుందన్నారు. 'సద్వాణి' అంటేనే మంచి మాట అన్నారు. ఈ పుస్తకాన్ని త్రిశూలపాణి మరణానంతరం వారి కుమార్తెలు ముద్రణ రూపంలో తీసుకుని రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రఫుల్ల కాశీ విశ్వనాథ శర్మ, డాక్టర్ ఆశావాది సుధామ వంశీ, డాక్టర్ నగరూరు రసూల్ సుధాకర్, శారద, శ్రీధర్ మూర్తి, డాక్టర్ శ్యామ సుందర శాస్త్రి పాల్గొన్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక జీసెస్ నగర్‌లోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శనివారం విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ.. రక్తమార్పిడి విషయంలో రక్తగ్రూప్ చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు తమ రక్త గ్రూపు తెలుసుకోవాలని సూచించారు. దాదాపు 440 మందికి పైగా విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసి గుర్తింపు కార్డులు జారీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మోహన్ కృష్ణ, భాస్కర్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్ బాబు, ఎస్. పురుషోత్తం పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సోమనాథ్ నగర్ బ్రిడ్జిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరపాలక సంస్థలో కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారిగా ఉన్న తపోవనం వైపు పోవు సోమనాథ్ నగర్ బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేసి 50 ఏళ్లు అయ్యిందని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టెండర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ పనులు చేపట్టలేదన్నారు. బ్రిడ్జ్ సరిగా లేనందున వర్షాలు వస్తే రంగస్వామి నగర్, యువజన కాలనీ, రజక నగర్, గౌరవ గార్డెన్, హనుమాన్ కాలనీ, నాలుగు, ఐదు రోడ్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. సీపీఎం నాయకులు రామిరెడ్డి, వెంకటనారాయణ, ప్రకాష్, వలి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానిస్తున్న టైం స్కేల్ ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నాన్‌టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగులను క్యాడర్ వైజ్ చేయాలని ఆ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శనివారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా టైం స్కేల్ ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టైం స్కేలు ఉద్యోగుల సంఘం నాయకులు సంజీవప్ప, చంద్రశేఖర్ నాయుడు, హనుమంతప్ప, రవి, రమేష్ ,నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

మసీదుల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: మసీదుల నిర్వహణలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ధ్వజమెత్తారు. శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇమామ్‌లకు రూ.5 వేలు ఉన్న గౌరవవేతనాన్ని రూ.10 వేలకు, మౌజన్లకు రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో 302 మసీదులకు క్రమం తప్పకుండా గౌరవ వేతనాలు అందించేవారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ఇప్పటి వరకు ఇమాం, మౌజన్లకు 7 నెలలుగా గౌరవవేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. 604 ఇమాం, మౌజన్ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మైనార్టీ మంత్రి ఎన్ఎండీ షారూఖ్ స్పందించాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హజ్‌కి వెళ్లే హాజీలు హైదరాబాద్‌కు వెళ్లకుండా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేశారన్నారు. పవిత్ర మక్కా యాత్రకు వెళ్లడానికి అదనంగా రూ.84,000 కేంద్ర ప్రభుత్వం హాజీ నుంచి వసూలు చేస్తే.. గత ప్రభుత్వంలో జగనన్న హాజీలపై భారం పడకుండా రూ.14.45 కోట్లు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 105 హాజీలు మాత్రమే మక్కాకు వెళ్లడానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో 1,771 మంది మక్కా యాత్రకు వెళ్లారన్నారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను చులకన భావంతో చూస్తోందని ఆరోపించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఖాజాపీర్, 40వ డివిజన్ నాయకులు ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయరా?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ వెంకట నరసింహులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీలో కాంగ్రెస్ బలోపేతానికి అన్ని జిల్లాల్లో తిరుగుతున్నామన్నారు. అందులో భాగంగా అనంతపురం జిల్లాకు రావడం జరిగిందన్నారు. గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా ప్రజల సంక్షేమాన్ని పటించుకోలేదన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయరా? అని ప్రశ్నించారు. అలాగే ప్రాజెక్టులు పూర్తి చేసి తాగు నీరు, సాగు నీరు అందించాలన్నారు. హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇతర ప్రజా, కమ్యూనిస్టు పార్టీలను కలుపుకుని పోరాటాలు చేపడతామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలమ్మ ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అతివృష్టి, అనావృష్టితో రైతులు వీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కోటా సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు శంకర్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఇమామ్, శర్మాస్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై వివక్ష చూపడం అమానుషం

అనంతపురం సెంట్రల్: అభంశుభం తెలియని అంగన్‌వాడీ చిన్నారులపై కులవివక్ష చూపించడం అమానుషమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. శనివారం ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఆందోళన నిర్వహించారు. ఏపీడీ వనజాక్షికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో దళిత పిల్లల విషయంలో కుల వివక్షత గురించేయడం తగదన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాల్యంలోనే కులరక్కసి గురికావడం బాధాకరమన్నారు. సనాతన ధర్మం పాటించి తీరుతామనే నాయకులు తీరు మార్చుకోవాలని సూచించారు. పడమటి కోడిపల్లి అంగన్‌వాడీ బడిలో కులవివక్షత గురించి ఏ ప్రజాప్రతినిధి కూడా నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. కుల వివక్షత, అంటరానితనం, బానిసత్వం నుంచి ఎస్సీ, ఎస్టీలను చైతన్యపరిచే విధంగా ముందుకు పోతామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోవిందు, రామ్‌దాసు, విజయ్, రామకృష్ణ, వేణుగోపాల్, ఈశ్వరయ్య, వన్నూరప్ప, రాము, బొమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో ఇబ్బందులు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో రోడ్లపై మురుగు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొన్ని చోట్ల గతంలో వేసిన సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలు వీధులు నడవడానికి కూడా వీలు లేకుండా తయారయ్యాయి. దుర్వాసన, దోమలతో ప్రజలు అవస్థలు వర్ణనాతీతం. ఈ విషయంపై సర్పంచ్ గౌతమి మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుధ్య పనులు చేయిస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్లు వేస్తే కొన్ని చోట్ల మురుగు నీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని అడిషనల్ ఎస్పీ డీవీ రమణ మూర్తి పేర్కొన్నారు. శనివారం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో విధి నిర్వహణలో మరణించిన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పరంగా అందాల్సిన ప్రయోజనాలు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు, కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐలు ధరణికిశోర్, క్రాంతికుమార్, ఆర్ఐ మధు, ఆర్ఎస్ఐ రమేష్ నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంత కీర్తిని ప్రపంచ స్థాయికి చాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం: జిల్లా కీర్తిని ప్రపంచ స్థాయికి చాటాలని మేయర్ వసీం సలీం అన్నారు. ఈనెల 17న కర్నూలులో రాష్ట్రస్థాయి ర్యాపిడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. నగరానికి చెందిన పి.మహేశ్వర రెడ్డి (3వ తరగతి) అండర్–7 విభాగంలో సత్తా చాటి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం దక్కించుకున్నారు. అండర్–11 విభాగంలో లక్ష్మీ ప్రణతి (ఆరో తరగతి) నాలుగో స్థానం దక్కించుకుంది. శనివారం జిల్లా క్రీడాకారులను మేయర్ అభినందించారు.

పీడీఎస్‌యూ సభలు జయప్రదం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఈనెల 24న హైదరాబాద్‌లో, నవంబర్ 5న విజయవాడలో జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల సభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు జి.వీరేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 సంవత్సరాలుగా పీడీఎస్‌యూ విద్యార్థుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రైవేటీకరణ చేస్తున్నాయన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జూనియర్ కళాశాలల్లో సరైన సదుపాయాలు లేవన్నారు. విద్యా వ్యవస్థ సమూల మార్పుల కోసం పీడీఎస్‌యూ అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి బండారు శంకర్, జిల్లా కమిటీ సభ్యులు ఉదయబాబు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా



ఉదయం 11:30 దాటినా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఆత్మకూరు: సనప సచివాలయంలో శనివారం ఉదయం 11:30 గంటలు అయినా ఉద్యోగులు కనిపించ లేదు. కేవలం వీఆర్వో రాజశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ బాబావలి ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఒక్కో సచివాలయంలో 11 శాఖలకు సంబంధించిన అధికారులు ఉండాలి. ప్రస్తుతం వ్యవసాయ, ఆరోగ్య సిబ్బందికి పక్కన కేంద్రాలు ఉన్నాయి. మిగిలిన వారు మాత్రం 11:30 అయినా విధులకు హాజరు కాలేదు. ఉద్యోగులు యథేచ్ఛగా విధులకు డుమ్మా కొడుతున్నారు.